వ్యాపారులు బీమా చేయించుకోవాలి

● మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

దగ్ధమైన డబ్బాను పరిశీలిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, జూన్ 11 : ఆపత్కాలంలో అండగా నిలిచేందుకు చిరు వ్యాపారులు బీమా చేయించుకోవాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సూచించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మహిళా నాయకురాలు కొమ్ములక్ష్మికి చెందిన డబ్బా అగ్ని ప్రమాదంలో దగ్ధమైన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఘటనా స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. అనంతరం మాజీమంత్రి రూ.10వేలు ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధైర్యపడొద్దని, అండగా ఉంటామని భరోసా కల్పించారు. చిరు వ్యాపారులు తప్పక బీమా చేయించుకోవాలని, ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు కొంత ధైర్యంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం కూడా చిరు వ్యాపారులకు బీమా సౌకర్యం కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. మాజీ మంత్రి వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు విజయ్‌కుమార్, నందిమల్ల అశోక్, తిరుమల్, గంధం పరంజ్యోతి, నీలస్వామి, గిరి, మురళీసాగర్, రహీం, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

జములమ్మను దర్శించుకున్న మాజీ మంత్రి

వనపర్తి టౌన్, జూన్ 11 : మృగశిరకార్తెను పురస్కరించుకొని మంగళవారం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి జములమ్మను దర్శించుకున్నారు. జములమ్మ ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ఆయన ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి సన్మానించారు. ఆలయ అభివృద్ధి కోసం గతంలో రూ.5లక్షలు మంజూరు చేశామని, తన శక్తిమేరకు సహకరిస్తానని మాజీ మంత్రి చెప్పారు. ఆయనతో పాటు బీఆర్ఎస్ నాయకులు గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్, రమేశ్‌గౌడ్, విజయ్‌కుమార్, జాత్రునాయక్, ఉంగ్లం తిరుమల్, నాగన్నయాదవ్, కంచె రవి, మురళీసాగర్, సూర్యవంశం గిరి, యుగంధర్, చెన్నారెడ్డి, రంగన్న, రాములు, ఆంజి, తిరుపతయ్య, తోట శ్రీను పాల్గొన్నారు.

రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

● జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి

వనపర్తి, జూన్ 11 : వానకాలంలో స్వల్పకాలిక, అధిక దిగుబడినిచ్చే రకాల పంటలను శాస్త్రవేతలు, వ్యవసాయాధికారుల సూచన మేరకు సాగు చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని నాగవరం రైతువేదికలో వానకాలంలో సాగు చేసే పంటలపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి సోమవారం రైతు నేస్తం ద్వారా శాస్త్రవేతలతో వీసీలో నిర్వహించిన అవగాహన సదస్సులో డీఏవో చంద్రశేఖర్, ఉద్యాన శాఖ అధికారి సురేశ్‌లతో కలిసి జెడ్పీ చైర్మన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వానకాలంలో స్వల్పకాలిక, అధిక దిగుబడినిచ్చే రకాలను మాత్రమే రైతులు ఎంపిక చేసుకోవాలన్నారు. పత్తి పంటను రైతులు అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేయడంతో అధిక దిగుబడి పొందవచ్చని , ఈ పద్ధతిలో 80*20 లేదా 75*20 సెం.మీ.ల దూరంలో మొక్కలు నాటుకోవాలన్నారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేయడంతో ఏకకాలంలో పంట కోతకు రావడం, యాసంగిలో వేరొక పంట సాగు చేసుకోవడానికి వీలవుతుందన్నారు. ఎరువులు, పురుగుమందులు శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సూచించిన మోతాదులోనే వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో కురుమయ్య, ఉద్యాన అధికారి శ్రీకాంత్, ఏఈవోలు సునీల్, కవిత, సూర్యతేజ, సురేశ్, వంశీ, మండలంలోని ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సంత స్థలం విషయంలో ఎమ్మెల్యే హామీ ఏమైంది?

● తీర్మానం పంపినా చర్యలు శూన్యం ● మున్సిపల్ పాలకవర్గం సూటి ప్రశ్న

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు

పెబ్బేరు, జూన్ 11 : వివాదాస్పద పెబ్బేరు సంత స్థలం విషయంలో వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మున్సిపల్ పాలకవర్గం డిమాండ్ చేసింది. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి కౌన్సిలర్లతో కలిసి విలేకరులతో సమావేశంలో మాట్లాడారు. ఈ ఏడాది జనవరి 12వ తేదీన జరిగిన మున్సిపల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే సంత స్థలం విషయంలో మున్సిపాలిటీ తీర్మానం చేస్తే మొత్తం 30.19ఎకరాల భూమిని సంతకే అప్పజెప్పేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు. ఆ మేరకు ఫిబ్రవరి 7న జరిగిన సమావేశంలో పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేస్తూ ప్రభుత్వానికి పంపిందని చెప్పారు. ఇప్పటికీ నాలుగు నెలలు దాటినా ఈ విషయంపై ఎమ్మెల్యే స్పందించడం లేదన్నారు. అప్పట్లో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి చొరవతో సంతకు 16ఎకరాలు ఇప్పించారని వారు వివరించారు. కానీ ఎమ్మెల్యే మాత్రం మొత్తం 30.19 ఎకరాలు సంతకే వచ్చేటట్లు చేస్తానని ఎన్నికల్లోనూ హామీ ఇచ్చిన విషయాన్ని వారు గుర్తు చేశారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేకపోవడంతో స్థలం యజమానులు తాము సంత కోసం ఉచితంగా ఇచ్చిన 16ఎకరాలను తిరిగి స్వాధీనం చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని వారు చెప్పారు. ఇదే జరిగితే పెబ్బేరు పట్టణం సంత స్థలాన్ని పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రభుత్వం ఆ స్థలంలో సంతను నిర్వహించరాదని ఆదేశించిందన్నారు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాదికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ నిలిచిపోయిందని వారు చెప్పారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే మేఘారెడ్డి స్పందించి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి కృష్ణారావు జోక్యం చేసుకొని పెబ్బేరు సంతను కాపాడాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపిబాబు, ఎల్లారెడ్డి, పార్వతి, నాయకులు మేకల ఎల్లయ్య, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్‌లేని ప్రైవేట్ బస్సులను సీజ్ చేయాలి

గద్వాల అర్బన్, జూలై 11: జిల్లావ్యాప్తంగా ఫిట్‌నెస్ లేని ప్రైవేట్ పాఠశాల బస్సులు నడుపుతున్నారని, వారిపై చర్య లు తీసుకోవాలని పీడీఎస్‌యూ, టీఎన్ఎస్ఎఫ్, యూఎస్ఎఫ్ఐ సంఘం నాయకులు జిల్లా రవాణా శాఖ అధికారులను కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రవాణా శాఖ కార్యాలయంలో ఎంవీఐ రాములు నాయక్ వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మే 15లోగా ప్రైవేట్ పాఠశాల బస్సులు ఫిట్‌నెస్ చేయించుకోవాలని, యాజమాన్యాలు నిబంధనలను తుంగలో తొక్కి బస్సులు నడుపుతున్నారని, అలాగే సరైన శిక్షణ లేని డ్రైవర్లను వినియోగిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు హలీంపాషా, సుభాన్, రంగస్వామి తదితరులు ఉన్నారు.

లక్కీడిప్ ద్వారా విద్యార్థుల ఎంపిక

● జోగుళాంబ గద్వాల కలెక్టర్ సంతోష్

గద్వాల, జూన్ 11 : బెస్ట్ అవేలబుల్ పాఠశాలల్లో చదివేందుకు ఎస్సీ విదార్థులను లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసినట్లు కలెక్టర్ సంతోష్ తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లా షెడ్యూల్డ్‌కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవేలబుల్ పాఠశాలల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను వారి తల్లిదండ్రుల సమక్షంలో మంగళవారం కలెక్టర్ లక్కీడిప్ ద్వారా ఎంపిక చేశారు. జిల్లాలో నిర్దేశించిన ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరేందుకు 57నాన్‌రెసిడెన్షియల్, ఐదో తరగతిలో చేరేందుకు 59 రెసిడెన్షియల్ సీట్లు కేటాయించగా మొత్తం 833మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరిలో 33శాతం బాలికలకు కేటాయించగా మిగిలిన సీట్లను జనరల్ కోటాలో లక్కీడిప్ తీసినట్లు చెప్పారు. అదే విధంగా ఆయా తరగతిలో రిజర్వేషన్లు ఉన్న బాలికలు, జనరల్ కోటాలో 10మంది చొప్పున అదనంగా వెయిటింగ్ లిస్టులో ఉంచేందుకు లక్కీడిప్ తీసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు ఆయా తరగతుల్లో చేరకుంటే ప్రాధాన్యతా క్రమంలో వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న విద్యార్థులకు ఆ సీట్లు కేటాయిస్తామని జిల్లా సంక్షేమశాఖ అధికారి శ్వేతా ప్రియదర్శిని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 12వ తేదీన తమ ధ్రువీకరణపత్రాలను తీసుకొని ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు రమేశ్‌బాబు, ఇందిర విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లక్కీడిప్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తున్న కలెక్టర్ సంతోష్

ప్రైవేట్ దవాఖానల తనిఖీ

శ్రీ రాఘవేంద్ర దవాఖానలో రికార్డులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో

గద్వాల టౌన్, జూన్ 11 : జిల్లా కేంద్రంలోని శ్రీరాఘవేంద్ర మదర్ అండ్ చిల్డ్రన్స్ దవాఖానను మంగళవారం ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో శశికళ, డిప్యూటీ డీఎంహెచ్‌వో సిద్ధప్ప తనిఖీ చేశారు. దవాఖాన వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఈనెల 9వ తేదీన మృతి చెందిన శివలీలకు సంబంధించిన ఐసీ, ఓటీ రిజిస్టర్, ల్యాబ్‌రికార్డు, స్కానింగ్ రిపోర్ట్స్, సీ సెక్షన్, డెలీవరి రిపోర్ట్స్‌ను సేకరించారు. ఈ రిపోర్టులను పరిశీలించి పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని ఆమె తెలిపారు. అలాగే చింతలపేటలోని సూరజ్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. ఆ సమయంలో క్వాలీఫైడ్ డాక్టర్ లేకపోవడం, ఇతర వ్యక్తులు రోగులకు చికిత్స చేయడాన్ని గుర్తించారు. దీంతో దవాఖానకు నోటీసులు జారీ చేశారు. ప్రైవేట్ దవాఖాన నిర్వాహకులు రోగులతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే గుర్తింపు రద్దు చేయడమే కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట మధుసూదన్‌రెడ్డి, నరసయ్యలు తదితరులు ఉన్నారు.

14న జాబ్ మేళా

గద్వాల టౌన్, జూన్ 11: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో ఈనెల 14వ తేదీన డీపీవో పోస్టుకు ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు డీఐఈవో హృదయరాజు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఇందుకు 2024లో హెచ్‌ఈసీ, సీఈసీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని తెలిపారు. మేళాకు హాజరయ్యే విద్యార్థులు పదోతరగతి, ఇంటర్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ఒక ఫొటోతో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 8317 638406 నెంబరును సంప్రదించాలని సూచించారు.

నల్లా కనెక్షన్లపై ఇంటింటి సర్వే

వనపర్తి, జూన్ 11: గ్రామాల్లో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఎన్ని ఉన్నాయో వాటిపై అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాఘవ తెలిపారు. మండలంలోని పెద్దగూడెం తండాలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యదర్శులు గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వే పారదర్శకంగా చేపట్టాలన్నారు. రాబోయే పది రోజుల్లో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్యదర్శి రామచంద్రయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

భూవివాదంలో ఇద్దరిపై కేసు నమోదు

గోపాల్‌పేట, జూన్ 11 : భూవివాదంలో దాడులకు పాల్పడిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై తిరుపతిరెడ్డి కథనం మేరకు..రేవల్లికి చెందిన గాజుల అంజయ్య, గాజుల నిరంజన్ (దాయాదులు) భూములు సక్రమంగా పంచుకోలేదని మంగళవారం పొలం వద్ద గొడవపడి ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయగా ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కిడ్నీ వ్యాధి బాధిత మహిళకు ఆర్థిక సాయం

గద్వాల రూరల్, జూన్ 11 : మండలంలోని అనంతపురం గ్రామానికి చెందిన సుచరితకు రెండు కిడ్నీలు ఫెయిలయ్యాయి. దీనికి తోడు ఊపిరితిత్తుల్లో నీరు చేరి అనారోగ్యంతో బాధపడుతున్నది. భర్త ఆర్థిక పరిస్థితులు బాగాలేక పోవడంతో సోషల్ రెస్పాన్స్ బులిటీ సంస్థను ఆశ్రయించాడు. సంస్థ సభ్యులు స్పందించి మంగళవారం బాధిత కుటుంబానికి దవాఖాన ఖర్చుల నిమిత్తం రూ.42వేలు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.

ఈవీఎంల తరలింపు

● అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్

గద్వాల, జూన్ 11 : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలకు సంబంధించిన సీ కేటగిరి, ఫస్ట్‌లెవల్ చెకింగ్ చేయని సీయూ, బీయూ, వీవీప్యాట్‌లను వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో భద్రంగా ఈసీఐఎల్, ఈఎస్ఎండీ హైదరాబాద్‌కు తరలించినట్లు అదనపు కలెక్టర్ అపూర్వచౌహాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధులకు అనుమానం లేకుండా వారి సమక్షంలో గోదాం తెరిచి ఈవీఎంలను తరలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో తాసీల్దార్ వెంకటేశ్వర్లు, సీ-సెక్షన్ అధికారి నరేశ్, ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సమయపాలన పాటించాలి

● డీడబ్ల్యూవో సుధారాణి

అయిజ, జూన్ 11: అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని డీడబ్ల్యూవో సుధారాణి ఆదేశించారు. మంగళవారం పట్టణానికి సమీపంలోని స్వయంభూ కట్టకింద తిమ్మప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో మూడు మండలాల అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లతో సమావేశం నిర్వహించారు. చిన్నారుల్లో బరువు, కొలతలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న కార్యకలాపాలను ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నాణ్యమైన గుడ్లు అందించాలన్నారు. కేంద్రాల నిర్వహణలో లోపాలు ఉంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సీడీపీవో కమలాదేవి, సూపర్‌వైజర్లు వాసంతి, సంధ్యారాణి, తెల్లమ్మ, శశికళ, జిల్లా కోఆర్డినేటర్ కల్యాణ్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీడబ్ల్యూవో సుధారాణి

విత్తన దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

ఉండవెల్లి, జూన్ 11: అలంపూర్ చౌరస్తాలోని శ్రీనివాస ట్రేడర్స్, మన గ్రోమోర్, ఎస్‌బీ ఆర్గానిక్, ఎంఆర్‌కే ట్రేడర్స్ విత్తన దుకాణాలను టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు వివిధ కంపెనీల విత్తనాల ప్యాకెట్ల ధరలు, కొనుగోలు చేసిన రైతుల వివరాలను పరిశీలించారు. టాస్క్‌ఫోర్స్ టీం సభ్యుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. విత్తనాలను కొనుగోలు చేసిన ప్రతి రైతుకూ విధిగా ఒరిజినల్ రసీదులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా విత్తనాలను అధిక ధరలకు విక్రయించడంతోపాటు అక్రమాలకు పాల్పడితే లైసెన్సులను రద్దు చేస్తామన్నారు. తనిఖీలో ఏవో సురేఖ, హెడ్‌కానిస్టేబుల్ అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

అధిక సాంద్రతలో పత్తిసాగు చేయాలి

అయిజ, జూన్ 11: అధిక సాంద్రత పద్ధతిలో పత్తి విత్తనాలు సాగు చేయడంతో అధిక లాభాలు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం పట్టణంలోని రైతు వేదకలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పత్తిసాగుపై వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. ఒకేసారి పత్తి పగిలే రకాలను ఎంచుకోవడం, మొక్కలను దగ్గరగా నాటడంతో అధిక దిగుబడితో నవంబర్, డిసెంబర్‌లోనే పంట చేతికొస్తుందన్నారు. గులాబీ రంగు పురుగు నుంచి పైరు తప్పించుకుంటుందన్నారు. రెండో పంటను వేసుకోవడానికి అవకాశం లభిస్తుందన్నారు. తక్కువ ఎత్తులో పెరిగే రకాలు, కొమ్మలు తక్కువ పొడవుగా ఉండే రకాలతో, పంట త్వరగా చేతికొస్తుందన్నారు. మండలాల్లోని రైతులకు పత్తిసాగు చేసే విధానం, రకాలపై అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏడీఏ వెంకటలక్ష్మి, ఏవోలు శంకర్‌లాల్, అయూబ్, చంద్రశేఖర్, రాధ, సురేఖ, ఏఈవోలు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఏడీఏ, ఏవోలు

ఏఎస్సై పేరుతో రూ.80వేల సైబర్ క్రైం

ధరూర్, జూన్ 11 : ఏఎస్సైనంటూ ఓ పెట్రోల్ బంక్ మేనేజర్ నుంచి రూ.80వేల సైబర్ క్రైం రూపంలో దోపిడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం మేరకు మండలంలోని జాంపల్లి గ్రామానికి చెందిన గోపి మండల కేంద్రంలోని ఓ పెట్రోల్ బంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అయితే జూన్ 4వ తేదీన పెట్రోల్ బంక్ యజమాని సుధాకర్‌కు గుర్తు తెలియని నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి నేను ఏఎస్సైను మాట్లాడుతున్నాను మాఎస్సై కూతురికి ఆరోగ్యం బాగాలేదు నేను రూ.80వేల పంపిస్తున్నాను. మీరు ఫోన్‌పే ద్వారా డబ్బులు వారికి పంపించాలని సూచించారు. అయితే ఆ వ్యక్తి నేను బంక్ వద్ద లేను మా మేనేజర్‌కు ఫోన్ చేయాలని సూచించాడు. దీంతో ఆవ్యక్తి మేనేజర్‌కు ఫోన్ చేసి రూ.80వేల ఫోన్‌పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. నగదు ఎంతకూ పంపకపోవడంతో మోసపోయామని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి అధికారులు, లీడర్ల పేరిట డబ్బులు అడిగితే పంపొద్దని సూచించారు. అలా జరిగితే 100కు, లేదా 8712670293 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

బీసీ కుల గణన వెంటనే చేపట్టాలి

గద్వాలటౌన్, జూన్ 11 : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బీసీ కుల గణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సేన రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు బీసీ సేన సంఘం సభ్యులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు సకలజనుల సర్వే చేపట్టి అన్ని వర్గాల ప్రజల సంపూర్ణ సమాచారాన్ని సేకరించారని గుర్తు చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మధుసూదన్‌బాబు, దామోదర్, శ్రీనుయాదవ్, వెంకట్ రాములు, నర్సింహులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

మానవపాడు, జూన్ 11: కండ్ల ముందే ఆడుకుంటూ విద్యుదాఘాతానికి గురై బాలుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకున్నది. మండలకేంద్రానికి చెందిన జగ్గుల శ్రీనివాసులు, మద్దమ్మకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు వీరేశ్(7) రోజూమాదిరిగానే ఇంటిముందు ఆడుకుంటున్నాడు. ఇంటికి సమీపంలోనే రోడ్డుపై అటుగా వెళ్తున్న ఎద్దుల బండి రోడ్డు పక్కన కట్టేసిన మరో ఎద్దు పోట్లాడాయి. ఈ క్రమంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో స్తంభానికి ఉన్న ఎల్టీ లైన్ తీగ తెగి పడింది. వైరు తెగి పడిన విషయం తెలియక, ఆటలో నిమగ్నమైన బాలుడికి తగలడంతో అక్కడికక్కడే పడిపోయాడు. గమనించిన కుటుంబీకులు హుటాహుటిన దవాఖానకు తరలించగా.. చికిత్స అందించేలోగా మృతిచెందాడు. ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఒక్కగానొక్క కుమారుడిని మృత్యువు కబలించడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

తాళం వేసిన షాప్‌లో చోరీ

ఎర్రవల్లి చౌరస్తా, జూన్ 11: తాళంవేసిన షాప్‌లో చోరీ జరిగిన ఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలోని పొగాకు కంపెనీ గ్రామంలో చోటుచేసుకున్నది. ఎస్సై వెంకటేశ్ కథనం ప్రకారం.. పొగాకు కంపెనీ గ్రామానికి చెందిన సుధాకర్ కిరాణం షాప్ నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం షాప్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లారు. తెల్లవారుజామున వచ్చి చూడగా షాప్ తాళం, గడియ విరగ్గొట్టి ఉన్నది. అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా రూ.40వేల నగదు పోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సమస్యల సాధనకు ఉద్యమించాలి

పాన్‌గల్, జూన్11: నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని డీవైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ విమర్శించారు. మండలంలోని తెల్లరాళ్లపల్లిలో డీవైఎఫ్ఐ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణా తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిరుద్యోగ సమస్యల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా యువత పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు మహేశ్, శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

బడులను అలంకరించి స్వాగతించాలి

వీపనగండ్ల, జూన్11: నూతన విద్యాసంవత్సరం నేటి నుంచి ప్రారంభం కాగా.. పాఠశాలలను అలంకరించి విద్యార్థులను స్వాగతించాలని డీఈవో గోవిందరాజులు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర, ప్రాథమిక పాఠశాల(ఎంఆర్‌సీ)ని ఎంఈవో లక్ష్మణ్ నాయక్‌తో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ముందుగా పాఠశాలలో నిర్వహిస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. పాఠశాలలకు పంపిణీ చేస్తున్న పాఠ్యపుస్తకాల సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలీశ్వరయ్య, శ్రీనివాసులు, పరమేశ్, స్వామి, సత్యనారాయణ, సీఆర్పీలు వెంకటేశ్, నాగరాజు, రాము లు తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాంలు పంపిణీ

ధరూరు, జూన్ 11: పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో యూనిఫాంలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మంగళవారం అందజేసినట్లు సీసీ జయరాజ్ తెలిపారు. ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు యూనిఫాంలను కుట్టి పాఠశాలలకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రఫియాసుల్తానా, గ్రామ సంఘం అధ్యక్షుడు ఖాజాబీ, అంగన్‌వాడీ టీచర్ రజియా, జయమ్మ, వీరమ్మ, నాగమ్మ, సరోజమ్మ పాల్గొన్నారు.

బడీడు పిల్లలు పొలాల్లో కనిపించొద్దు

గట్టు, జూన్ 11 : బడీడు పిల్లలు ఎట్టి పరిస్థితుల్లో పత్తి పొలాల్లో కనిపించరాదని తాసీల్దార్ సరితారాణి స్పష్టం చేశారు. స్థానిక రైతువేదికలో ఆర్గనైజర్లు, సబ్‌ఆర్గనైజర్లలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. సీడ్ పత్తి సాగు ప్రారంభమయ్యే సమయంలో బడుల్లో విద్యార్థుల హాజరుశాతం పూర్తిగా తగ్గిపోతోందని, దీనివల్ల మండలంలో విద్యాభివృద్ధి కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తంచేశార